క్లుప్తంగా

వేసవి చలివేంద్రం ప్రారంభం



తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్‌సెంటర్–బస్‌స్టేషన్ రహదారి మధ్యలోని బస్‌షెల్టర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి ఛైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, హ్యాపీ హాస్పటల్ నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక ప్రారంభించారు. గత 15 ఏళ్లుగా ప్రతి వేసవిలోనూ ఇదే షెల్టర్‌లో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను వెల్లడించారు. 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, ఎస్ఆర్‌కే శర్మ, యలవర్తి సాంబశివరావు, గుమ్మడి నారాయణ, షేక్ కాలేషా వలి, పెసర్లంక రమణ, మౌలాలి, గుమ్మడి నారాయణ, తుల్లిమిల్లి చంటి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సత్కారం



తెనాలి: పట్టణ నాజరుపేట మిషన్ కాంపౌండులోని సెయింట్స్‌పాల్ ఒకేషనల్ జూనియర్ కాలేజిలో గత మార్చిలో జరిగిన ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదివారం జరిగిన సభలో సత్కరించారు. ఇదే వేదికపై తెనాలి బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైన బేతాళ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కాలేజి కరస్పాండెంట్/ ప్రిన్సిపాల్ మోపర్తి అబ్రహాం లింకన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేఎం విల్సన్, శ్రీమహాత్మా గాంధీ సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా బ్యాలెట్ ఓటింగ్



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామం లయోలా పాఠశాలలో జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రం చుట్టుపక్కల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారి వెంట, పాఠశాలలో సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

కోరమాండల్ గ్రోమోర్ రైతు సంబరాలు



గుంటూరు రూరల్: బుడంపాడులోని ఐటీసీ గోదాముల్లో ఆదివారం కోరమాండల్ గ్రోమోర్ రైతు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మోహన్ మాట్లాడుతూ గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లక్కీ డ్రా పద్ధతిలో విజేతలను ఎంపిక చేశామన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన 9 మంది రైతులకు టీవీఎస్ ఎక్సెల్ వాహనాలను అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ హరి, నానో డీఏపీ బిజినెస్ మేనేజర్ స్వరూప్, మార్కెటింగ్ అధికారి తిరుపతిరావు, లాజిస్టిక్ ఆఫీసర్ యోగేశ్‌రెడ్డి, అగ్రోనమిస్ట్ వెంకటేష్ తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలంలోని పల్లపాడు, సొపాడు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో హిందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, కృష్ణారావు, రొంపిచర్ల రామకృష్ణ, శివలింగంనాయక్, బ్రహ్మం, రోహిత్, సుబ్బారావు, ప్రకాష్, అన్నపూర్ణ, ప్యారమ్మ, షైనీ, చంద్రిక, విద్య, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి కృషి

- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి జగన్
- కొలకలూరు గ్రామానికి రూ.105 కోట్ల సంక్షేమం అందించా
- ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలతో సహా పేదల సంక్షేమాన్ని కోరుకుంటూ వారి అభ్యున్నతికోసం కృషి చేసేది కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని ఆ పార్టీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టంగా చెప్పారు. గత ప్రభుత్వ పాలన, అప్పట్లో అందిన సంక్షేమాన్ని, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వ పరిపాలనను బేరీజు వేసుకుని, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని చెప్పారు. తెనాలి రూరల్ మండలగ్రామం కొలకలూరులో ఆదివారం ముస్లిం మైనారిటీలు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆత్మీయ సమావేశానికి కోడూరి రమేష్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, విభిన్న కులాలు, మతాలు కలిసిన కొలకలూరు గ్రామంలో గత అయిదేళ్లలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు రూ.105 కోట్ల సంక్షేమాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తుచేశారు. 2014లో అప్పటి ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో ఎంత వ్యత్యాసం ఉన్నదో ప్రజలు గ్రహించాలని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని చెప్పారు. అప్పట్లో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యేకు కూడా అవకాశం ఇవ్వలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు ఎమ్మెల్యేలుగా ఉన్నారని గుర్తు చేశారు. నేటికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పటం ముస్లిం మైనార్టీలు అభ్యున్నతికి ఉదాహరణగా శివకుమార్ చెప్పారు. తమను ఆదరించే పార్టీనే ముస్లిం మైనారిటీలు ఆదరించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే శివకుమార్ గ్రామంలోని జెండాచెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు పినపాటి అనిల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కుర్రా జస్వంత్, అంజుమన్ కమిటీ సభ్యులు మహమ్మద్ హానిఫ్, అమీర్ భాష, షేక్ హుస్సేన్, షేక్ జానీ, షేక్ బాజీ, షేక్ ఎస్.బాజీ, సయ్యద్ రసూల్, షేక్ నాగూర్, షేక్‌అజ్గర్ అలీ, మల్లవరపు బుల్లయ్య, మల్లవరపు భరత్, కొల్లంటి దాస్, సుద్దపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్‌కు శ్రీకాకుమాను శంకరుని వంశస్థుల మద్దతు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీకాకుమాను శంకరుని వంశస్థులతో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమావేశమయ్యారు. ప్రత్యేక సమావేశానికి హాజరైన శివకుమార్‌కు కాకుమాను వంశస్థులు, కుటుంబ సభ్యులు విజయ సంకేతాన్ని చూపుతూ ఎన్నికల్లో ఆయన విజయానికి తమ మద్దతు ఇస్తామని ప్రకటించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటైన సమావేశానికి శ్రీకాకుమాను శంకరుని ధర్మ సత్రం వ్యవస్థాపక వంశ పారంపర్య అధ్యక్షుడు కాకుమాను శరత్ బాబు ఆధ్వర్యంలో వారి వంశస్థులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కాకుమాను వంశీయులందరితో కలిసి ఎమ్మెల్యే అల్పాహార విందు చేశారు. ఏనాటి నుంచో ఉన్న తమ స్నేహ సంబంధాల్ని గుర్తు చేసుకుంటూ కొద్దిసేపు మాటామంతీ నిర్వహించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో పోలింగ్‌కు అన్నాబత్తుని శివకుమార్ తమ మద్దతు ఉంటుందనితెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పాల్గొన్నారు.

సహజయోగ ధ్యానమండలిలో

పట్టణంలోని నాజర్ పేటలోని శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ధ్యానమండలి కేంద్రాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం సందర్శించారు. శ్రీమాతాజీ పాదపద్మాలకు నమస్కరించి పుష్పాలను సమర్పించారు.ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. సహజయోగులు కేవీ సురేష్ బాబు, రఘు, అనంతలక్ష్మి, శివ, మురళి, నన్నపనేని భాస్కరరావు , మధుసూదనరావు, జగన్మోహన్ రావు, ఆంజనేయులు, కన్నెగంటి గోపీచంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి కరీముల్లా ఉరుసు మహోత్సవం

పెదకాకాని: పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 15వ ఉరుసు గంధ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు వేడుకల నేపథ్యంలో కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం కళకళలాడుతుంది.
పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్న సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా నిషాని వ్యవస్థాపకుడు పఠాన్ మహబుబ్ సుమాని తెలిపారు.మూడు రోజుల ఉరుసు మహోత్సవాల్లో బాగంగా ఆరోతేదీ రాత్రి కంబల్ పాతేహాతో ఉరుసు మహోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. రెండోరోజు గంధం మహోత్సవము, చివరి రోజు దీపారాధన, అన్నసంతర్పణ ఉంటుందని వివరించారు.



కరీముల్లా షా ఖాదరి నిషాని

గుంటూరు ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

పెదకాకాని: గుంటూరు ఆటోనగర్‌లో పాత వాహనాల విడిభాగాలు అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెదకాకాని పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ నుంచి అగతవరప్పాడు సాయిబాబా మందిరం వైపు వెళ్ళే రోడ్డు శివారు ప్రాంతమైన రైల్వేగేటు వద్ద పాత , తుప్పు పట్టిన, వేలంపాటల్లో దక్కించుకున్న వాహనాలు, విడిభాగాల నిల్వ ప్రాంతంలో ఆదివారం నిప్పు అంటుకుంది. మంటలు వ్యాపించి పాత వాహనాలు వాటి విభాగాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకుని అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.



కాలిపోయిన పాత వాహనాలు

ఓటరు చైతన్య ఉద్యమం అవసరం

- స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి
- బాలాజీ శ్రీనివాస్ పిలుపు



మాట్లాడుతున్న బాలాజీ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఓటర్ల చైతన్య ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లో సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంటే ప్రజలతో వారి సంక్షేమం , అవసరాల కోసం ఐదేళ్లకు ఒకసారి తమ ప్రతినిధిగా ఎన్నుకునే ప్రక్రియ అని అన్నారు. తక్కువ ఓటు శాతంతో ఎన్నుకోబడే ప్రజాప్రతినిధి బాధ్యత రాహిత్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 80 శాతానికి పైగా ఓట్లతో ఓటర్లు తమ ప్రతినిధిని ఎన్నుకోవడం ద్వారా సదరు ప్రజా ప్రతినిధి జవాబుదారీతనంతో ప్రజల సంక్షేమం కోసమే చట్టాలు చేసి, ప్రజల మన్ననలు పొందుతాడని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లలో ఉన్న చైతన్యం పట్టణ ప్రాంతాల్లో లేకపోవడం బాధాకరమని వివరించారు. తమ ప్రతినిధిని ఎంచుకునే ప్రక్రియలో ఓటరు కొంత సమయాన్ని పోలింగ్ బూత్ వద్ద కేటాయించటం బాధ్యతగా భావించాలని కోరారు. జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ సంస్థ జాతీయ చైర్మన్ ప్రొఫెసర్ సుబ్బరంగయ్య, రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం పెరుగుదలకు అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తోందన్నారు. దేశంలో 80 శాతం పైగా ఓటు నమోదు ప్రక్రియలో ప్రజలను జాగృతం చేసే విధంగా అంతర్జాతీయంగా సేవలకు మారుపేరుగా ఉన్న రోటరీ, లయన్స్ క్లబ్బులు ముందుకు రాగలిగితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు కేవీ భాస్కరరావు, కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, కోశాధికారి కేవీవీ ప్రసాద్, రొటేరియన్స్ సీతా రమేష్, గాలి సుబ్బారావు, ముప్పాళ్ళ సుబ్బారావు, పచ్చిపులుసు చిరంజీవి, బ్రహ్మం పాల్గొన్నారు.

శ్రీనివాసశర్మ, నటుడు కావూరికి సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: ఖగోళ వాస్తు శాస్త్రాలు సశాస్త్రీయమైనవని, సూర్యచంద్రులు, నక్షత్రాల గమనాల ఆధారంగా మానవ హితం కోరి శాస్త్రాలు ఏర్పడ్డాయని ప్రముఖ వాస్తు జ్యోతిష సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని రీడింగ్ రూమ్స్ భవన సమావేశ మందిరంలో శాస్త్రాలపై, బ్రాహ్మణత్వంపై జరుగుతున్న అశాస్త్రీయ దాడులకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సిద్ధాంతి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ మన విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న పాశ్చాత్య దేశాలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దశాబ్దాలుగా దేవాలయాలను ఆదాయ వనరులుగా చూడటం, ధర్మాన్ని కాపాడే బ్రాహ్మణులపై కొంత మంది అధికారుల పెత్తనం బాధాకరమన్నారు. ఈ ధోరణి మారగలిగితేనే హిందూ సమాజం మనుగడ సాగించగలదన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఉచిత వైద్యశిబిరం



తెనాలి: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళగిరికి చెందిన వేదాంత హాస్పటల్స్‌కు చెందిన వైద్యులు సాధారణ వ్యాధులతోపాటు మూత్రపిండాలు, గుండె, మోకాళ్ల నర్దరీకి సంబంధించిన పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ చింతా రామకృష్ణ, డాక్టర్ మంజుల శ్రీరామ్, డాక్టర్ శ్రీనివాస్ పోలిశెట్టి, డాక్టర్ ఎ.మదన్‌కుమార్, కన్సల్టెంట్ డాక్టర్ షారామ్ పరీక్షలు చేసి, అవసరమైన సలహాలు ఇచ్చారు. ప్రముఖ న్యాయవాది దరిశి శివకోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రాజెక్టు ఛైర్మన్ గుండా రామకోటేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, ఎం.కుమార్, ఎం.వేణు, మాలేపాటి తిరుమలరావు, కర్పూరపు హరనాథ్ గుప్త పర్యవేక్షించారు.

నవ్వుతోనే ఆరోగ్యం



గుంటూరు వెస్ట్: ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనే గొప్ప ఆయుధం నవ్వని లాఫింగ్ క్లబ్ గుంటూరు వ్యవస్థాపకులు లాల్ వజీర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ వజీర్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలుగా మేలన్నారు. సమస్యలు రాని మనుషులు ఉండరని, వాటిని చిరునవ్వుతో ఎదిరిస్తే ప్రపంచాన్ని జయించేంత ఆత్మ బలం చేకూరుతుందన్నారు. చక్కని వ్యాయామం, యోగ, మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ జీవించాలని దీనికి అదనంగా నవ్వును కూడా జోడించాలన్నారు. లాఫింగ్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా నవ్వుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

నవ్వు ఒక దివ్య ఔషధం

లక్ష్మీపురం: నవ్వు ఒక భోగమని, నవ్వకపోవడం ఒక రోగమని, నవ్వించడం ఒక యోగమని ఓ చిరునవ్వు అనేక మందిని దగ్గర చేస్తుందని ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండేలా చేస్తుందని హస్యవల్లరి కో ఆర్డినేటర్ వి.వి. రావ్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి డాక్టర్ చంద్ర రాధికా రాణి మాట్లాడారు.

కులం పేరుతో దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన పలువురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంజీవయ్యనగర్ ఫస్ట్ లైన్‌లో నివాసించే ద్వారక మధ్యవర్తుల ద్వారా ప్రైవేట్ బ్యాంకులో లోన్ తీసుకుంది. ఐదు నెలలుగా బ్యాంకు వాయిదాలు చెల్లించడం లేదు. మధ్యవర్తిగా వ్యవహరించిన లక్ష్మి, గాయత్రి, కల్యాణి, బాలు ఆదివారం ద్వారకా వద్దకు వెళ్లి లోన్ ఎందుకు చెల్లించడం లేదని అడిగారు. వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. లక్ష్మి, గాయత్రీ, కల్యాణి, బాలు కులం పేరుతో దూషించి చెయ్యి చేసుకున్నారు. ద్వారాక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే లక్ష్మి, గాయత్రీ, కల్యాణి, బాలు లోన్ డబ్బులు అడిగేందుకు ద్వారక ఇంటికి వెళ్లగా ఆమె తండ్రి నలుగురిపై దాడి చేసినట్లు ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొంగరాలబీడు మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం



నగరంపాలెం: స్థానిక బొంగరాలబీడు మహాప్రస్థానం అభివృద్ధి కోసం ముల్లమూరి మాలకొండయ్య రూ.1,00,116 విరాళం ఆదివారం కమిటీ సభ్యులకు అందించారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని శ్మశాన వాటిక అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కల్లూరి రమణయ్య అన్నారు.

మద్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు తెలంగాణ మద్యా న్ని సాయిప్రసాద్ కారులో తరలిస్తున్నాడు. కంకరగుంట ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న స్క్వాడ్ టీమ్ ఏడు లీటర్ల మద్యాన్ని, తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ పరిశోధకుడు ఎస్.నాగేశ్వరరావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. సోషియాలజీ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఆల్కాహాలిజం ఆన్ షెడ్యూల్డ్ కాస్ట్ పాపులేషన్ ఇన్ గుంటూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని తెలిపారు.

8వరకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

తెనాలి రిటర్నింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



పోస్టల్ బ్యాలట్ నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి రూరల్: పట్టణ కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం సాయంత్రం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఈ నెల 13 వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెనాలిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పివో, ఏపివోలకు ఆదివారం ఇక్కడ ఉదయం నుండి శిక్షణ ఇవ్వగా వారు సాయంత్రం 4 గంటల నుండి జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ తెనాలిలో నివాసం ఉండే ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమ, మంగళవారాల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగనుంది. అదే విధంగా సాయంత్రం నుండి జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని తెనాలి రిటర్నింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడి ఇక్కడ ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు ఓటింగ్‌కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం రాత్రి పొద్దుపోయే వరకు ఓటింగ్ కొనసాగింది. పోలింగ్ విధులకు సంబంధించి పివో, ఏపివోలకు రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి జరిగిన శిక్షణా కార్యక్రమంలో పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ప్రఖర్‌జైన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పివో, ఏపివోలకు ఎన్నికల విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

జనసేన, టీడీపీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పట్టణ 18వ వార్డునుంచి ఎమ్మెల్యే శివకుమార్ వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నేతలు



పట్టణ 37వ వార్డునుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శివకుమార్, భవనం వెంకటరెడ్డి

తెనాలి: తెనాలి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ ఆయా పార్టీల నుంచి కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని 18వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుండి పెద్ద సంఖ్యలో ముస్లిం మైనారిటీ యువత వైయస్సార్‌సీపీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో పఠాన్ రెహమాన్, షేక్ అజ్గర్, షేక్ ఖలీల్ వారి మిత్ర బృందం 40 మందికి పైగా పార్టీలో చేరారు. పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వారికి పార్టీ కండువాలను కప్పి, స్వాగతం పలికారు. పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు, 22వ వార్డు కౌన్సిలరు షేక్ దుబాయ్ బాబు, 18వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌసియా, షేక్ అన్సారీ, పార్టీ నాయకులు షేక్ సలీమ్, బాజి, జాఫర్, బిలాల్, ఖలీల్, సుల్తాన్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

37వ వార్డు నుంచి చేరికలు

టీడీపీ, జనసేనకు చెందిన మరికొందరు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భవనం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక 37వ వార్డుకు చెందిన బోడ బలరాం, ఆయన మిత్రబృందం 30 మంది గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు మేలు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప



కొలకలూరులో ప్రచారంలో అన్నాబత్తుని పుష్ప

తెనాలి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెనాలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప చెప్పారు. మండల గ్రామం కొలకలూరులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికతో కలసి ఆమె ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ 27 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రూ. 1800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్, ఎంపీగా కిలారి వెంకటరోశయ్యలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల డాక్టరేట్ పొందిన గ్రామానికి చెందిన నూతక్కి పుష్పప్రజ్ఞాచారిని ఈ సందర్భంగా సత్కరించి అభినందించారు. ప్రచారంలో కోడూరు స్వప్న రమేష్, చక్క సీతమ్మ కొలకలూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, రావూరి జేవియర్, పినపాటి అనీల్‌కుమార్, మల్లవరపు బాబి, సుద్దపల్లి వీరయ్య, పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

సుద్దపల్లిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

సుద్దపల్లి(చేబ్రోలు): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లిలో ఆదివారం సుద్దపల్లి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలను అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఆటగాళ్లతో కలిసి బ్యాటింగ్ , బౌలింగ్ చేస్తూ తోటి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతో పాటు ఆరోగ్యానికి క్రీడలు ముఖ్యమేనన్నారు. టోర్నమెంటు నిర్వహకులు ముసలా సుబ్బారావు, నాగరాజు, సుంకర శివకృష్ణ, తోట నాని, శ్రీనివాసరావు, కోళ్ల నవీన్, శ్రీకాంత్, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి ప్రారంబించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి



చేబ్రోలు మండలం సుద్దపల్లిలో క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో అంబటి మురళీకృష్ణ